సాక్షి గుంటూరు


బుధవారం, 15, అక్టోబర్, 2025

I



315 రోజులుగా దీక్షలు

తాడేపల్లిరూరల్: బ్రహ్మానందపురంలో ఏపీసీ కార్మికులు చేపట్టిన దీక్షలు మంగళవారం నాటికి 315వ రోజుకు చేరుకున్నాయి. శిబిరాన్ని కేసీ వర్క్స్ యూనియన్ నాయకులు సందర్శించారు.



పులిచింతల సమాచారం

అచ్చంపేట: పులిచింతల ప్రాజెక్టుకు ఎగువ నుంచి 74,600 క్యూసెక్కులు వచ్చి చేరుతుండగా, దిగువకు 81,966 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రస్తుత నిల్వ 42.1600 టీఎంసీలు.



టీటీడీకి రూ.10 లక్షలు విరాళం

గుంటూరుమెడికల్: తిరుమల తిరుపతి దేవస్థానం నిత్యాన్నదానం ట్రస్టుకు రూ.10 లక్షల విరాళాన్ని సుష్మగౌడ్ ఫౌండేషన్ అధ్యక్షులు జల్లెడ శ్రీనివాస్ గౌడ్,ఎస్ఎన్‌వీఎస్ ప్రసాద్‌గౌడ్‌లు అందజేశారు.

మరణాలపైనా మాయలే

- నీటి పరీక్షల్లో ఈ–కొలి, బ్యాక్టీరియా ఉన్నట్లు చెన్నై ల్యాబ్ నిర్ధారణ
- కానీ ఇప్పటికీ సురక్షితమే అంటూ బుకాయిస్తున్న చంద్రబాబు సర్కారు
- 60 వేల పరీక్షలు చేయించినా నేటికీ బయటకు రాని వాటి రిపోర్టులు

తురకపాలెంలో ప్రాణాలు పోతున్నా కూటమి ప్రభుత్వం అబద్ధాలు



నోరు తెరిస్తే ఏదో ఒక అబద్ధం.. అధికారం కోసం ఇన్నాళ్లు చంద్రబాబు సర్కారు అన్నింటా రెండు నాలుకల ధోరణే అవలంబించడం చూశాం. ఇప్పుడు ప్రజల ప్రాణాలు పోతున్నా అవే మాయ మాటలు చెబుతూ కాలం గడుపుతోంది కూటమి ప్రభుత్వం. ఊరికి ఊరే ప్రాణభయంతో బిక్కుబిక్కుమంటున్నా కనీస జాలి కూడా లేకుండా వ్యవహరిస్తోంది.

సాక్షి ప్రతినిధి, గుంటూరు: జిల్లాలోని తురకపాలెంలో ఆరు నెలలుగా సంభవిస్తున్న మరణాల వెనుక మిస్టరీ ఇంకా వీడలేదు. ప్రభుత్వం కూడా దీనిపై ఇంతవరకు ఎలాంటి స్పష్టమైన ప్రకటన కూడా చేయలేదు. తురకపాలెంలో హెల్త్ ఎమర్జెన్సీ ప్రకటించి ముచ్చటగా 6 రోజుల్లోనే ఎత్తేసింది. మరోవైపు జ్వరాలు, వాపులు, కాళ్లపై గడ్డలతో ఆస్పత్రులకు వెళ్లిన వారు తిరిగి క్షేమంగా ఇంటికి వస్తారో.. లేదో? అనే పరిస్థితి ఇంకా కొనసాగుతూనే ఉంది. గత వారంలో ఇలాంటి లక్షణాలతోనే ఓ మహిళ (24) చనిపోయింది. మరికొందరు ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, పలువురు ప్రముఖ వైద్యులు కూడా మెలియాయిడోసిస్ వల్ల సంభవిస్తున్న మరణాలు అని చెప్పినా ప్రభుత్వం దీనిపై అధికారికంగా ప్రకటన చేయలేదు. పలు వైద్య బృందాలు తురకపాలెంకు వచ్చి మట్టి, నీటి నమూనాలను సేకరించాయి. ఇక్కడి నీటి శాంపిళ్లను చెన్నై ల్యాబ్‌కు పంపించాయి.

కొంతమందికే పరిహారం..

ఈ ఏడాది మొదటి నుంచి ఇప్పటివరకు గ్రామంలో 46 మంది చనిపోయారు. ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో 29 మంది అధికారికంగా చనిపోయినట్లు నివేదిక ఇచ్చారు. వీరికి మాత్రమే ప్రభుత్వం రూ.5 లక్షల పరిహారం అందజేసింది. వీరిలో ఒకరు మెలియాయిడోసిస్ వల్ల చనిపోయినట్లు నిర్ధారించారు. మిగతావారిలో గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్ బాధితులు ఎక్కువ అని ప్రభుత్వం లెక్కలు తేల్చింది. గ్రామంలోని 1,100 మందికి 60 వేలకుపైగా వైద్యపరీక్షలు నిర్వహించింది. ఎక్కువ మందికి షుగర్, బీపీలతోపాటు కిడ్నీ సంబంధిత వ్యాధులు, 300 మందికిపైగా లివర్ సమస్యలు ఉన్నట్లు గుర్తించింది. బాధితులకు ఆ వైద్య పరీక్షల రిపోర్టులు మాత్రం ఇవ్వకపోవడం గమనార్హం.

పరస్పర నెపాలు..

తురకపాలెం మరణాలపై ప్రభుత్వ శాఖల్లో ఎవరికి వారు తమ తప్పు లేదని చెప్పే ప్రయత్నం చేస్తున్నారు. తొలుత గ్రామంలో వరుస మరణాలకు అతిగా మద్యం తాగడం కారణమనే అంచనాలపై నివేదికలు సిద్ధం చేశారు. దానిని పక్కనపెట్టేసి నీటిలో, మట్టిలో ఏమైనా హానికర రసాయనాలు ఉండవచ్చని మరో నివేదిక సిద్ధం చేశారు. తర్వాత మెలియోయిడోసిస్ వ్యాధితో కేవలం ఒక్కరు మరణించారని చెప్పారు. మిగిలిన మరణాలకు కారణం తేల్చలేకపోయారు. గ్రామస్థాయిలో పనిచేస్తున్న వైద్యులు, సిబ్బంది ఈ మరణాల నివేదికను జిల్లా స్థాయి ఉన్నతాధికారులకు సకాలంలో అందించలేదని, అందువల్లే కట్టడి చేయలేకపోయామంటూ మరొక నివేదిక సిద్ధం చేసి, కింది స్థాయి వైద్య సిబ్బందిపై వేటుకు రంగం సిద్ధం చేశారు. మళ్లీ గ్రామంలోని ఆర్ఎంపీలపై వేటు వేసే ప్రయత్నం చేశారు. అధిక మొత్తంలో యాంటిబయోటిక్స్, స్టెరాయిడ్స్ వాడటం ద్వారా మరణాలు సంభవించాయంటూ ఆర్ఎంపీ క్లినిక్‌ను సీజ్ చేశారు. మరోపక్క నీటిలో యురేనియం నిల్వలున్నాయని, వాటి ద్వారా మరణాలు సంభవించవచ్చని టీడీపీ అనుకూల మీడియా ప్రచారం చేసింది. ఇంకోపక్క గ్రామంలో దీర్ఘకాలిక వ్యాధి వల్లే మరణాలు సంభవించాయంటూ మరో కథనం ప్రచారం చేసింది.

బ్యాక్టీరియా ఉందన్నా...

తురకపాలెంలో నీటి పరీక్షల్లో బయలాజికల్ కాలుష్యం ఎక్కువగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. నీటి నమూనాలను చెన్నైలోని పరిశోధనశాలకు పంపగా గ్రామంలోని జలాల్లో ఈ–కొలి బ్యాక్టీరియా, స్ట్రానియం, ఏరోబిక్ మైక్రోబయల్ కౌంట్ ఎక్కువగా ఉన్నట్లు తేలింది. తర్వాత రాష్ట్ర ప్రభుత్వం నీటి కాలుష్యం లేదని ప్రకటించింది. గ్రామంలో మరణాలు సంభవించకుండా చేపట్టాల్సిన చర్యలను మాత్రం గాలికి వదిలేసింది. గ్రామస్తులు తమకు జరుగుతున్న అన్యాయంపై వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డిని మంగళవారం కలిసి మొరపెట్టుకున్నారు. భయంతో ఊరు ఖాళీ అయిపోతోందని, చుట్టాలు కూడా రావడం లేదని వాపోయారు.



వైద్య పరీక్షలు చేస్తున్న సిబ్బంది (ఫైల్)

సైబర్ కేటుగాడు అరెస్టు

- ఎఫ్‌బీలో ఫ్రెండ్ రిక్వెస్టులు, మెసేజ్‌లతో అమాయకులకు బురిడీ
- ఆపై అసభ్యకరంగా చాటింగ్ చేస్తున్నారని పేర్కొంటూ బెదిరింపులు
- కాల్‌బాయ్‌గా అవకాశం అంటూ సైబర్ నేరాలు
- ఎట్టకేలకు పాత నేరస్తుడిని అరెస్ట్ చేసిన పోలీసులు



మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం/గుంటూరువెస్ట్: కాల్ బాయ్ వ్యాపారం ముసుగులో సైబర్ నేరాలకు పాల్పడే ఓ పాత నేరస్థుడిని పట్టాభిపురం పోలీసులు అరెస్ట్ చేసినట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అన్నారు. అతని నుంచి మొబైల్ ఫోన్లు, సిమ్ కార్డులు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గుంటూరు నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని హాల్‌లో మంగళవారం మీడియా సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ఆరు నెలల క్రితం ఎస్‌వీఎన్ కాలనీలో ఓ వృద్ధుడికి(68) ఫేస్‌బుక్ మెసెంజర్‌లో శైలజ మూర్తి పేరుతో హాయ్ అని మెసేజ్ వచ్చిందన్నారు. వృద్ధుడు కూడా హాయ్ పంపించాడని చెప్పారు. కాల్ బాయ్‌గా చేస్తే నగదు చెల్లిస్తామని పేర్కొనడంతో వృద్ధుడు వద్దని చెప్పాడన్నారు. తర్వాత పది రోజులపాటు అవతలి వ్యక్తి వాయిస్ కాల్స్ చేసినట్లు పేర్కొన్నారు. వేరే నంబర్లతోనూ కాల్ చేసి పోలీసులమని, మహిళలతో అసభ్యకరంగా చాట్ చేస్తున్నావని వృద్ధుడికి బెదిరింపులు వచ్చాయన్నారు. కేసు నమోదైందని, మాఫీకి నగదు ఇవ్వాలని బెదిరించారని చెప్పారు. ఆదాయపు పన్ను శాఖ అధికారులమని, రైస్ మిల్లుల్లో అక్రమ లావాదేవీలు జరిగాయని, తనిఖీలకు వస్తున్నామని హెచ్చరించారు. వృద్ధుడు భయపడి పలు ఖాతాలకు సుమారు రూ.కోటి జమ చేశారని తెలిపారు. తర్వాత మోసపోయినట్లు తెలిసి పట్టాభిపురం పీఎస్‌లో ఫిర్యాదు చేశాడన్నారు. సీఐ వెంకటేశ్వర్లు కేసు దర్యాప్తు చేపట్టారని పేర్కొన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం సాయిబాబా గుడి బజారుకు చెందిన బోడ చైతన్యకృష్ణ పవన్ (27)ను నిందితుడిగా తేల్చారని పేర్కొన్నారు. అతడిని అదుపులోకి తీసుకుని విచారించామని, నేరం రుజువు కావడంతో అరెస్ట్ చేశామని వివరించారు.

విచారణలో విస్తుపోయే విషయాలు...

ఇంటర్ వరకు చదివిన చైతన్యకృష్ణ పవన్ బెంగళూరు కేంద్రంగా కాల్‌బాయ్ పేరుతో మోసగిస్తున్నాడు. నాలుగేళ్లపాటు సికింద్రాబాద్, హైదరాబాద్, నిజామాబాద్ ప్రాంతాల వారిని మోసగించాడు. మహిళల పేర్లతో ఫేస్‌బుక్‌లో ఖాతాలు తెరిచి మెసేజ్ చేస్తూ పరిచయం చేసుకునేవాడు. కాల్‌బాయ్ కథ అల్లేవాడు. గొంతులు మార్చి కాల్ చేసేవాడు.

వసూళ్లే వసూళ్లు

ఒప్పుకొంటే ఏవేవో ఫీజుల కింద రూ.20 వేలు, రూ.30 వేలు తీసుకునేవాడు. తర్వాత బాధితులకు వేరే ఫోను నంబర్లతో కాల్ చేసి పోలీస్ అని బెదిరించేవాడు. ఆడవాళ్లతో అసభ్యంగా చాటింగ్, ఇబ్బందులకు గురిచేస్తున్నారంటూ కేసు నమోదైందని బెదరగొట్టేవాడు. మళ్లీ వేరే నంబర్లతో ఫోన్ చేసి హైకోర్టు న్యాయవాది, సీఐ, ఎస్ఐ, కానిస్టేబుల్ ఇలా పలు విధాలుగా చెప్పేవాడు. కేసు లేకుండా చూసేందుకని 2022లో హైదరాబాద్‌లో ఓ వ్యక్తిని సుమారు రూ.1.70 లక్షలకు మోసగించాడు. సైబరాబాద్ క్రైం పీఎస్‌లో కేసు నమోదైంది. 2024 సైబరాబాద్‌కు చెందిన వ్యక్తి నుంచి రూ.20 లక్షలు కాజేశాడు. ఈ ఏడాది జనవరిలో హైదరాబాద్ వాసి నుంచి రూ.2 లక్షలు, నిజామాబాద్‌కు చెందిన వ్యక్తి నుంచి రూ.37 వేలు జమ చేయించుకున్నాడు. కేసును ఛేదించిన పట్టాభిపురం పీఎస్ సీఐ జి.వెంకటేశ్వర్లు, ఎస్ఐ రాజ్‌కుమార్, పీఎస్ఐ ప్రదీప్, హెచ్‌సీ ప్రసాదరావు, ఐటీ కోర్ సీఐ నిస్సార్ బాషా, హెచ్‌సీ రాజాకిషోర్‌లను జిల్లా ఎస్పీ అభినందించి, ప్రశంసాపత్రాలు అందించారు.

పరిశ్రమలపై 'చిన్న'చూపు

- చెన్నైకి ఐటీసీ యూనిట్ తరలింపునకు ప్రయత్నం
- ఆందోళనలో 200 మంది కార్మికులు



తాడేపల్లిలోని ఐటీసీ కంపెనీ

తాడేపల్లి రూరల్: నూతన రాజధాని అమరావతిలో ఉన్న చిన్న పరిశ్రమలను తరలించేందుకు ఆయా శాఖల అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. దానిలో భాగంగా తాడేపల్లిలో ఉన్న ఐటీసీ స్మాల్ క్యాన్ ఫిల్లింగ్ ప్లాంట్‌ను తరలించేందుకు అధికారులు ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఐటీసీ స్మాల్ క్యాన్ ఫిల్లింగ్ ప్లాంట్ రాష్ట్రం నుంచి తరలిపోతుంటే ఏమాత్రం ప్రభుత్వ యంత్రాంగం పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. ఫిల్లింగ్ ప్లాంట్ పరిశ్రమను నమ్ముకుని అందులో పర్మినెంట్ ఉద్యోగులు కాకుండా 80 మంది కాంట్రాక్ట్ పద్ధతిపై విధులు నిర్వర్తిస్తున్నారు. ట్రాన్స్‌పోర్ట్ ద్వారా మరో 120 మంది కుటుంబాలను పోషించుకుంటున్నారు. ట్రాన్స్‌పోర్ట్‌లో డ్రైవర్లు కాకుండా వాహన యజమానుల కుటుంబాలు ఈ కంపెనీపై ఆధారపడి జీవనం కొనసాగిస్తున్నాయి. చిన్న పరిశ్రమలను ప్రభుత్వం కాపాడాలని కార్మిక సంఘం నాయకులు కోరుతున్నారు. కంపెనీ మూసివేస్తున్నట్లు అధికారికంగా ప్రకటించలేదు. కానీ అధికారులే స్వయంగా వేరే ఉద్యోగాలు చూసుకోండంటూ కార్మికులకు చెబుతున్నారు. దీంతో కార్మికుల కుటుంబాల్లో ఆందోళన పెరిగింది. 5 నెలల క్రితం వరకు ఇక్కడ ఉన్న ఆయిల్ కంపెనీలో 2500 కేఎల్ ఇంజిన్ ఆయిల్ ఉత్పత్తి చేయగా, దానిని క్రమక్రమంగా వెయ్యి కేఎల్‌కు తీసుకొచ్చారు. త్వరలోనే కంపెనీ మూసివేస్తారని కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

ఏకంగా బస్ షెల్టరుకే ఎసరు



గతంలో ఏర్పాటు చేసిన బస్ షెల్టర్



బస్ షెల్టర్‌ను దుకాణాలుగా మార్చిన దృశ్యం

- తొలుత టీడీపీ కార్యాలయంగా మార్పు
- తరువాత దుకాణాలుగా నిర్మాణం

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని నిడమర్రులో ఓ ప్రభుత్వ స్థలంలో బంధువుల జ్ఞాపకార్థం వారి కుటుంబసభ్యులు బస్ షెల్టర్ ఏర్పాటు చేశారు. 1978లో పాములపాటి రంగారెడ్డి, వెంకటరత్నం దంపతుల జ్ఞాపకార్థం వారి కుమారుడైన శివారెడ్డి దీన్ని నిర్మింపజేశారు. 2024 జూన్ 5వ తేదీన కూటమి ప్రభుత్వం వచ్చాక బస్ షెల్టర్ ఏర్పాటు చేసిన వారి సంబంధికులు దానిని టీడీపీ కార్యాలయంగా మార్చారు. ప్రస్తుతం ఆ కార్యాలయాన్ని తొలగించి, మరికొంత స్థలాన్ని కూడా ఆక్రమించి దుకాణాలు నిర్మించారు. అద్దెకు ఇచ్చేందుకు సన్నాహాలు జరుగుతుండడంతో స్థానికులు ముక్కున వేలేసుకుంటున్నారు. అధికారులు కూడా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మంత్రి లోకేష్ దృష్టికి తీసుకువెళ్లి బస్ షెల్టర్ ఏర్పాటు చేయిస్తామని కొంతమంది టీడీపీ నాయకులు చెబుతున్నారు.

నేటి నుంచి కాంట్రాక్టు విద్యుత్ ఉద్యోగుల సమ్మె



ఐకమత్యం చాటుతున్న యూనియన్, ప్రజా సంఘాల నాయకులు

లక్ష్మీపురం (గుంటూరు వెస్ట్): విద్యుత్ కాంట్రాక్ట్ కార్మికులు, జేఎల్ఎం గ్రేడ్ –2ల సమస్యల పరిష్కారం కోసం గురువారం నుంచి తలపెట్టిన నిరవధిక సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ విద్యుత్ ట్రేడ్ యూనియన్ పోరాట కమిటీ జిల్లా చైర్మన్ దాసరి వెంకటేశ్వరరావు పిలుపునిచ్చారు. పాత గుంటూరులోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మంగళవారం కమిటీ జనరల్ బాడీ సమావేశం రామ్‌ప్రభాకర్, జి.నాగరాజుల అధ్యక్షతన జరిగింది. చైర్మన్ దాసరి వెంకటేశ్వరరావు, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి దండా లక్ష్మీనారాయణ, యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు సీహెచ్ నాగబ్రహ్మచారి, జిల్లా గౌరవాధ్యక్షుడు బి.లక్ష్మణరావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి వై.నేతాజీ, జిల్లా నాయకులు సుబ్బారెడ్డి మాట్లాడారు. సమస్యలు పరిష్కరించకుంటే సమ్మె బాట పడతామని, దీనికి పూర్తిగా యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు జానీ, పవన్, రాంబాబు, వంశీ, అందే రాజేష్, కొండా, చంద్రశేఖర్ ఆచారి తదితరులు పాల్గొన్నారు.

ఏఎన్‌యూలో ప్రపంచ హస్తకళల దినోత్సవం



పెదకాకాని: సాంస్కృతిక వారసత్వాన్ని కాపాడటంలో హస్తకళలు కీలకపాత్ర పోషిస్తాయని ఫైన్ ఆర్ట్స్ డిపార్ట్‌మెంట్ అసిస్టెంట్ కోఆర్డినేటర్ పులిచెర్ల దేవకాంత్ అన్నారు. ప్రపంచ హస్తకళల దినోత్సవాన్ని పురస్కరించుకుని మంగళవారం ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో ప్రదర్శన ఏర్పాటు చేశారు. దేవకాంత్ మాట్లాడుతూ హస్తకళలు ఆర్థిక వ్యవస్థకు తోడ్పడటంలో, సృజనాత్మకతను ప్రోత్సహిస్తాయన్నారు. అనంతరం కొండపల్లి, ఏటికొప్పాక, చెన్నపట్నం బొమ్మలు, మంగళగిరి, ధర్మవరం, కలంకారి, చేనేత వస్త్రాలను విద్యార్థులు ప్రదర్శించారు. అధ్యాపకులు బి.శేఖర్‌బాబు, జాన్‌రత్నబాబు, వి.వీరయ్య, విద్యార్థులు సీహెచ్ హెలీనా, చక్రిత విద్య, రేణుక, బాంధవి, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

పట్టపగలే వ్యక్తి దారుణ హత్య

- కొబ్బరిబొండాల కత్తితో నరికి చంపిన దుండగుడు
- పాత కక్షలు, కుటుంబ కలహాలే కారణమని సమాచారం



ఘటనాస్థలంలో బుజ్జి మృతదేహం



తిరుపతిరావు అలియాస్ బుజ్జి (ఫైల్)

తెనాలి రూరల్: గుంటూరు జిల్లా తెనాలిలో పట్టపగలు ఓ వ్యక్తి దారుణ హత్యకు గురయ్యాడు. మృతుని కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాల మేరకు... బాపట్ల జిల్లా అమృతలూరు మండలం కోరుతాడిపర్రు గ్రామానికి చెందిన జూటూరి తిరుపతిరావు అలియాస్ బుజ్జి (60) గ్రామంలోని తమ సామాజిక వర్గంలో పెద్దగా ఉన్నాడు. ఆయనకు ఐదుగురు కుమార్తెలు. పెద్ద కుమార్తె గండికోట దుర్గ తెనాలి చెంచుపేటలోని ఎమ్మెల్యే బజారులో ఉంటోంది. బుజ్జి పది రోజుల క్రితం కుమార్తె వద్దకు వచ్చాడు. బైక్‌పై టిఫిన్ బండి వద్దకు మంగళవారం ఉదయం వెళ్లాడు. దోశలు ఆర్డరిచ్చి వేరే వ్యక్తితో మాట్లాడుతున్నాడు. అంతలోనే ద్విచక్ర వాహనంపై వచ్చిన గుర్తు తెలియని వ్యక్తి కొబ్బరి బొండాలు నరికే కత్తితో తిరుపతిరావును హత్య చేశాడు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించారు. గుంటూరు నుంచి వచ్చిన డాగ్ స్క్వాడ్, క్లూస్ టీం ఆధారాలు సేకరించింది. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కారణమేంటి?

పాత కక్షలు, ఆధిపత్య పోరు కారణంగానే ఈ హత్య జరిగినట్లు పోలీసుల ప్రాథమిక విచారణలో వెల్లడైంది. కోరుతాడిపర్రులో ఆలయానికి సంబంధించిన నగదు పాట నిర్వహించడం, ఆలయ వ్యవహారాల పర్యవేక్షణ వంటివి బుజ్జి చూస్తుంటాడు. అమృతలూరు సొసైటీ సభ్యుడిగా కూడా ఉన్నాడు. ఆలయ వ్యవహారం ఏళ్లుగా ఒక్కరే చూడాలా అంటూ గ్రామానికే చెందిన అల్లుడు వరుస అయ్యే వ్యక్తి ఇటీవల బుజ్జితో వాగ్వాదానికి దిగాడని, అలాగే తన తండ్రి మృతికి తిరుపతిరావు కారణమంటూ గతంలో ఘర్షణ పడ్డాడని తెలుస్తోంది. అతనే ఈ హత్య చేసి ఉంటాడని అటు గ్రామస్తులు కూడా భావిస్తున్నారు. మరో వైపు తిరుపతిరావు మనవరాలికి ఆమె భర్తకు మధ్య కలహాలు ఉన్నాయి. మూడు రోజులుగా చెంచుపేటలో పంచాయితీ నడుస్తోంది. కుటుంబ కలహాలకు తిరుపతిరావే కారణమని, అతడిని హతమారిస్తే కలహాలు ఉండవంటూ మనవరాలి భర్త సోమవారం రాత్రి హెచ్చరించాడని చెబుతున్నారు. గ్రామంలో ఆధిపత్య పోరులో అల్లుడి వరుస అయ్యే వ్యక్తి లేదా మనవరాలి భర్త ఈ హత్యకు పాల్పడి ఉండొచ్చని భావిస్తున్నారు. వారిద్దరూ ఒక్కటై పథకం వేసి హత్య చేసి ఉంటారనే కోణంలోనూ పోలీసుల దర్యాప్తు కొనసాగుతోంది.

న్యూస్‌రీల్

నీటి సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే క్రిమినల్ చర్యలే



గుంటూరు వెస్ట్: మంచినీటి సరఫరాలో అలసత్వం వహించే సిబ్బందిపై క్రిమినల్ చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ ఎ. తమీమ్ అన్సారియా హెచ్చరించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో సమావేశ మందిరంలో నిర్వహించిన అధికారుల సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ఉద్యోగులు సామాజిక బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. సమావేశంలో అనధికార బాణసంచా నిల్వలు, విక్రయాలు చేయొద్దని తెలిపారు. ఈ నెల 20వ తేదీన దీపావళి సందర్భంగా తాత్కాలిక షాపులు పెట్టుకోవడానికి అనువైన ఖాళీ ప్రదేశాలను గుర్తించాలని అధికారులను ఆదేశించినట్లు పేర్కొన్నారు. దుకాణాల ఏర్పాటుకు 17వ తేదీ వరకు దరఖాస్తులు సమర్పించాలన్నారు. అలాగే రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సీసీఐ) ద్వారా పత్తి కొనుగోళ్లకు ఏర్పాట్లు చేస్తున్నామని అన్నారు. వట్టిచెరుకూరు మండలం కూర్నూతలలో సీసీఐ పత్తి కొనుగోళ్లకు నోటిఫై చేసిన గాయత్రి కాటన్ ప్రెస్సింగ్ మిల్లులో సన్నద్ధత ఏర్పాట్లను మంగళవారం ఆమె పరిశీలించారు.

అమరేశ్వరుని హుండీ ఆదాయం



అమరావతి:అమరావతిలోని శ్రీ బాల చాముండికా సమేత శ్రీ అమరేశ్వర స్వామి దేవస్థానంలో మంగళవారం హుండీలలోని కానుకలను లెక్కించారు. కోటప్పకొండ త్రికోటేశ్వరస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి దాసరి చంద్రశేఖరరావు సమక్షంలో 12 హుండీలను తెరచి లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించారు. మూడు నెలల 7 రోజుల కాలానికి దేవాలయంలో ఉన్న హుండీల ఆదాయం మొత్తం రూ. 20,07,999. అన్నదాన మండపంలోని హుండీ ద్వారా రూ.48, 809 ఆదాయం వచ్చినట్లు ఆలయ కార్యనిర్వాహణాధికారి రేఖ తెలిపారు.

అచ్చంపేట జెడ్పీ హైస్కూల్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్



అచ్చంపేట: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు స్కూల్ ఎడ్యుకేషన్ రీజినల్ జాయింట్ డైరెక్టర్ బి.లింగేశ్వరరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు కావలసిన వసతులు, తరగతి గదులను పరిశీలించారు. ఇక్కడ 1950లో స్థలదాత తుమ్మేపల్లి శ్రీరాములు నిర్మించిన పురాతన భవనం శిథిలం కాగా, ఇటీవల పూర్వవిద్యార్థులు సుమారు రూ.20లక్షల వ్యయంతో ఆధునీకరించారు. అందులో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఏర్పాటుకు అనుకూలమని ఆర్జేడీ తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశారు. అయితే ఈ గదులను ఇంకా ఆధునీకరించవలసి ఉందన్నారు. త్వరలోనే పనులను ప్రారంభించనున్నట్లు చెప్పారు.

19న త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదానోత్సవం



గుంటూరు ఎడ్యుకేషన్ : తెలుగు సమాజంలోని గొప్ప సామాజిక విప్లవకారుడు కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని ఈనెల 19న సాయంత్రం 5 గంటలకు బ్రాడీపేటలోని యూటీఎఫ్ హాలులో నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు తెలిపారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి సంబంధించిన ఆహ్వాన పత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. 2025వ సంవత్సరానికి రామస్వామి చౌదరి పురస్కారాలను సుప్రసిద్ధ కవి, సాహితీ విమర్శకులు డాక్టర్ కోయి కోటేశ్వరరావు, రాజకీయ, సామాజిక ఉద్యమకారుడు డాక్టర్ ఆలా వెంకటేశ్వర్లుకు ఇస్తున్నట్లు ప్రకటించారు. కార్యక్రమంలో డాక్టర్ మూకిరి సుధ, వీసీకే పార్టీ మహిళా విభాగ రాష్ట్ర అధ్యక్షురాలు కైలా జయసుధ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ – జాషువా – పూలే – పెరియార్ లిటరేచర్ ఫౌండేషన్ అధ్యక్షుడు బి.విల్సన్ పాల్గొన్నారు.

మిర్చి యార్డు సమాచారం
(మంగళవారం ధరలు)



వచ్చిన బస్తాలు	57,430
అమ్మకాలు	56,332
నిల్వ	13,955

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-15,200
నంబరు-5	10,000-14,200
273	10,500-14,000
341	10,000-15,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	10,500-15,000
నంబరు-5	10,000-14,500
341	10,000-15,600
4884	10,000-14,000
సూపర్-10	10,500-14,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 15,200
బాడిగ-355	10,500 - 15,800
దేవనూరు డీలక్స్	10,000 - 14,800
ఆర్మూర్	9,800 - 12,500
తాలుకాయలు	5,500 - 7,200

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-15,000
బాడిగ - 355	10,000-15,500
దేవనూరు డీలక్స్	10,500-14,700
తాలు	5,300 - 8,000

-కొరిటెపాడు (గుంటూరు)

వైద్యారోగ్యశాఖ పూర్తిగా విఫలం

- మాజీ మంత్రి విడదల రజిని, సమన్వయకర్తలు నూరిఫాతిమా, వనమా బాల వజ్రబాబు
- అన్నవర్రు బీసీ హాస్టల్ విద్యార్థులకు గుంటూరు జీజీహెచ్‌లో పరామర్శ



మీడియా సమావేశంలో విడదల రజిని, నూరిఫాతిమా, వనమా బాలవజ్రబాబు, పానుగంటి చైతన్య తదితరులు

గుంటూరు మెడికల్: కూటమి అధికారంలోకి వచ్చి చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యాక సంక్షేమ హాస్టళ్లలో విద్యార్థులు రోగాల బారిన పడుతున్నారని మాజీ మంత్రి విడదల రజిని ఆరోపించారు. వైద్యారోగ్య శాఖ పూర్తిగా విఫలమైందని విమర్శించారు. గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న అనపర్రు బీసీ హాస్టల్ విద్యార్థులను మంగళవారం ఆమె పరామర్శించారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కురపం హాస్టల్‌లో ఇద్దరు చనిపోయారని గుర్తుచేశారు. , తాజాగా అనపర్రు హాస్టల్‌లో 31 మంది అస్వస్థతకు గురై గుంటూరు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారని చెప్పారు. అనపర్రు బీసీ హాస్టల్ వార్డెన్ వేధింపులను తట్టుకోలేక విద్యార్థులు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఎమ్మెల్యే పట్టించుకోకపోవడం దారుణమన్నారు. అలాగే, తురకపాలెంలో పదుల సంఖ్యలో చనిపోయినా ఇప్పటి వరకు కారణాలు నిగ్గుతేల్చలేకపోవడం ప్రభుత్వ వైఫల్యమేనన్నారు. గుంటూరు నగరంలో 200 మందికిపైగా డయేరియాతో జీజీహెచ్‌లో చికిత్స పొందినా పట్టించుకోలేదన్నారు. రాష్ట్రంలో వైద్యారోగ్య శాఖ పనిచేయడం లేదని, అది పూర్తిగా ఫెయిల్ అయిందని అన్నారు.

వారం రోజుల్లో హాస్టళ్లకు...

సంక్షేమ హాస్టళ్లు నేడు సంక్షోభంలో ఉన్నాయని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం రాష్ట్ర అధ్యక్షుడు పానుగంటి చైతన్య అన్నారు. జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న విద్యార్థులను పరామర్శించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా హాస్టళ్లలో తాము తనిఖీలు చేశామన్నారు. వారం రోజుల్లో వాటిని పరిష్కరించని పక్షంలో విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో హాస్టల్స్ బాట పడతామని స్పష్టం చేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షురాలు షేక్ నూరిఫాతిమా, తాడికొండ నియోజకవర్గ ఇన్‌చార్జి వనమా బాలవజ్రబాబు, నాయకులు, తదితరులు ఉన్నారు.

25న తెనాలిలో ఆంధ్రప్రదేశ్ పాడి రైతుల సభ



ఆహ్వానపత్రికను ఆవిష్కరిస్తున్న రైతులు

తెనాలి: పాడి రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని, కేరళ, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల తరహాలో లీటరుకు రూ.8-10 ప్రోత్సాహకధర ఇవ్వాలని కోరుతూ ఈ నెల 25వ తేదీన తెనాలిలో సభ నిర్వహించనున్నారు. ఆంధ్రప్రదేశ్ పాడి రైతుల జిల్లా ప్రథమ మహాసభను జయప్రదం చేయాలని సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ములకా శివసాంబిరెడ్డి కోరారు. తెనాలిలో మంగళవారం పాడిరైతులతో కలసి మహాసభ ఆహ్వానపత్రికను ఆవిష్కరించారు. అనంతరం మాట్లాడుతూ తెనాలి అయితానగర్‌లోని నన్నపనేని సీతారామయ్య సరస్వతమ్మ కల్యాణమండపంలో 25న ఉదయం 10 గంటలకు మహాసభ జరుగుతుందని తెలిపారు. గేదెపాలు లీటరుకు రూ.40, ఆవు పాలు రూ.20కు మించి డెయిరీల్లో ధర రావటం లేదన్నారు. పాడి పశువులకు బీమా మార్కెట్ ధర ప్రకారం నిర్ణయించాలని తెలిపారు. ప్రభుత్వమే ప్రీమియం చెల్లించాలని సంఘం జిల్లా నాయకురాలు వేజెండ్ల తబిత కోరారు. తెనాలి శాంతకుమారి, మాన్యం పద్మ, ఎల్లమాటి మేరమ్మ, కె.శకుంతల ఎ.సరోజిని, టి.నిర్మల, సంతోషం, సుశీల తదితరులు పాల్గొన్నారు.

జాతీయ అథ్లెటిక్స్ పోటీల్లో రజత పతకం



రోషన్‌ను అభినందిస్తున్న డి.శ్రీనివాసరావు, జీవీఎస్ ప్రసాద్

గుంటూరు వెస్ట్ (క్రీడలు): ఒడిశాలో ఈ నెల 10 నుంచి 14 వ తేదీ వరకు జరిగిన 40వ జాతీయ జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్‌షిప్‌లో గుంటూరుకు చెందిన ఎస్కే రోషన్ రజత పతకం సాధించాడు. అండర్ 20 యూత్ విభాగంలో 110 మీటర్ల హర్డిల్స్‌లో ఈ పతకాన్ని సాధించాడని అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆఫ్ గుంటూరు జిల్లా కార్యదర్శి జి.వి.ఎస్. ప్రసాద్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా రోషన్‌ను ఏపీ రెరా సభ్యుడు దామచర్ల శ్రీనివాసరావు స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో అభినందించారన్నారు. స్టేడియంలో అథ్లెటిక్స్ ట్రాక్ కూడా బాగు చేయాలని కోరారు. సదుపాయాలు కల్పిస్తే మరింత మంది రాణిస్తారని ఆకాంక్షించారు. రోషన్‌ను కోచ్ రామకృష్ణ, కె.రవి, కె.అరుణ్ కుమార్, పి.ఆనంద్ కుమార్, ఎస్కే మన్సూర్ వలి తదితరులు అభినందించారు.

ఘనంగా ఏపీ ఎస్పీఎఫ్ స్పోర్ట్స్ మీట్ ప్రారంభం



మాట్లాడుతున్న డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్

ఏఎన్‌యూ (పెదకాకాని): క్రీడల ద్వారా దేహదారుఢ్యం, ఐకమత్యం పెంపొందుతాయని ఏపీ ఎస్పీఎఫ్ డైరెక్టర్ జనరల్ డాక్టర్ సీఎం త్రివిక్రమ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రత్యేక రక్షణ దళం (ఏపీ ఎస్పీఎఫ్) రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలు మంగళవారం ఏఎన్‌యూలో ఘనంగా ప్రారంభం అయ్యాయి. త్రివిక్రమ్ ఈ పోటీలను ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డితో కలసి ప్రారంభించారు. 34వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని పోటీలను నిర్వహిస్తున్నారు. డాక్టర్ త్రివిక్రమ్ మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటముల తేడా లేదని, క్రీడా స్ఫూర్తి గొప్పదన్నారు. ఇన్‌స్పెక్టర్ జనరల్ బీవీ రామిరెడ్డి మాట్లాడుతూ డైరెక్టర్ జనరల్‌గా త్రివిక్రమ్ బాధ్యతలు స్వీకరించిన తరువాత ఏపీ ఎస్పీఎఫ్‌లో మార్పులు శరవేగంతో జరుగుతున్నాయన్నారు. రాష్ట్రంలో పలు చోట్ల మినీ శిక్షణ కేంద్రాలు ఏర్పాటుకు ప్రభుత్వం స్థలాలు కేటాయించిందన్నారు. సిబ్బంది సంక్షేమంపై ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. ఉద్యోగుల పదోన్నతులు, నూతన నియామకాలపై దృష్టి పెట్టారని చెప్పారు. ఈ క్రీడా పోటీలలో వాలీబాల్, బాడ్మింటన్, 100 మీటర్లు, 400 మీటర్లు, 5 కిలో మీటర్ల పరుగు పందేలు నిర్వహిస్తున్నారు. రాష్ట్రంలోని వివిధ యూనిట్ల నుంచి దాదాపు రెండు వందల మంది అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు. విజయవాడ జోన్ కమాండెంట్ ముద్దాడ శంకర్రావు, కమాండెంట్ డీఎస్‌పీ బాషా, అసిస్టెంట్ కమాండెంట్లు, ఇన్‌స్పెక్టర్లు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

పసుపు ధరలు
(మంగళవారం)



యార్డుకు వచ్చిన బస్తాలు : 214

కొమ్ములు : 152 బస్తాలు

(ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	10,850	10,825

కాయలు : 62 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,000	10,825	10,825

మొత్తం అమ్మకాలు : 160.5 క్వింటాళ్లు

-దుగ్గిరాల

ఈత పోటీలలో రైల్వే ఉద్యోగి ప్రతిభ



గంపల సాంబశివరావును అభినందిస్తున్న డీఆర్ఎం సుథేష్ణసేన్

లక్ష్మీపురం: దక్షిణ మధ్య రైల్వేలోని గుంటూరు డివిజనులో లోకో పైలట్ (గూడ్స్) గంపల సాంబశివరావు ఈత పోటీలలో ప్రతిభ చాటారు. జాతీయ, రాష్ట్ర స్థాయి ఈత పోటీలలో అత్యుత్తమ ప్రదర్శన ద్వారా సంస్థకు కీర్తి తెచ్చిపెట్టారని గుంటూరు డీఆర్ఎం సుథేష్ణసేన్ అన్నారు. పట్టాభిపురంలోని డీఆర్ఎం కార్యాలయంలో మంగళవారం సాంబశివరావును ఘనంగా సత్కరించారు. డీఆర్ఎం మాట్లాడుతూ ఈ నెల 11, 12వ తేదీల్లో మంగళగిరిలో ఎస్.మహబూబ్ షంషేర్ ఖాన్ జాతీయ స్విమ్మింగ్ చాంపియన్‌షిప్ పోటీలలో సాంబశివరావు 2 బంగారు, వెండి, కాంస్య పతకాలను కైవసం చేసుకోవడం అభినందనీయం అన్నారు. ఈ నెల 8వ తేదీన గుంటూరు ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన 8వ అంతర్ జిల్లాల మాస్టర్ స్విమ్మింగ్ పోటీలలో సైతం 4 బంగారు పతకాలను కైవసం చేసుకున్నారని తెలిపారు. ఏడీఆర్ఎం ఎం.రమేష్‌కుమార్, అధికారులు అభినందించారు.

ఎయిడ్స్ నియంత్రణ లక్ష్యాలు సకాలంలో చేరాలి

జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ యు.మాధవీలత



సమీక్ష చేస్తున్న డాక్టర్ మాధవీలత

నరసరావుపేట: జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణ కోసం నిర్దేశించిన లక్ష్యాలను సకాలంలో పూర్తిచేయాలని జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ అధికారి డాక్టర్ యు.మాధవీలత పేర్కొన్నారు. మంగళవారం కార్యాలయం నుంచి ఎయిడ్స్ నియంత్రణ చర్యలపై జిల్లాలోని ఐసీటీసీ, పీపీటీసీటీ, ఏఆర్‌టీ, డీఎస్ఆర్‌సీ, లింక్ ఏఆర్‌టీ, టీఐ, ఎన్‌జీఓఎస్‌లపై సమీక్ష సమావేశం నిర్వహించారు. డాక్టర్ మాధవీలత మాట్లాడుతూ జిల్లాలో హెచ్ఐవీ, ఎయిడ్స్ నియంత్రణ కోసం పరీక్షలు పెంచాలని, ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సంస్థ జిల్లాకు నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని అన్నారు. హెచ్ఐవీ నిర్ధారణ జరిగిన ప్రతి ఒక్కరిని ఏఆర్‌టీకి లింక్ చేయాలని, ఆయా కేంద్రాల ద్వారా హెచ్ఐవీ ఉన్న వారికి మందులు పంపిణీ చేయాలని ఆదేశించారు. అర్హత ఉన్న ప్రతి పేషెంట్‌కు ఏఆర్‌టీ కేంద్రాల ద్వారా పెన్షన్‌కు దరఖాస్తు చేయాలని, ఆయా కేంద్రాలలో ఎల్ఎఫ్‌యూ కేసులను కూడా తగ్గించాలని పేర్కొన్నారు. జిల్లాలోని గ్రామాలు, పట్టణాలు, స్కూళ్లు, కళాశాలల్లో విద్యార్థిని, విద్యార్థులకు హెచ్ఐవీ, ఎయిడ్స్, సుఖ వ్యాధులపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. క్లస్టర్ ప్రోగ్రామ్ మేనేజర్ జానీబాషా, క్లినికల్ సర్వీస్ ఆఫీసర్ చైతన్య, క్లస్టర్ ప్రివెన్షన్ ఆఫీసర్ కిరణ్, టెక్నికల్ ఎక్స్‌పర్ట్ శశిధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రేపు ఉచిత వైద్య శిబిరం

గుంటూరు వెస్ట్: ఏపీ స్టేట్ గవర్నమెంట్ రిటైర్డ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం ఉదయం స్థానిక కలెక్టరేట్ కాంపౌండ్‌లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ మేరకు అసోసియేషన్ కార్యదర్శి వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కళ్లు, దంతాలు, మధుమేహం, బీపీ తదితర వ్యాధులకు సంబంధించిన పరీక్షలు నిర్వహిస్తారన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు అందుబాటులో ఉంటారన్నారు. ఉద్యోగులు, విశ్రాంత ఉద్యోగులు, కార్మికులు వారి కుటుంబ సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

క్లుప్తంగా

సీపీఆర్‌పై అవగాహన అవసరం



గుంటూరు ఎడ్యుకేషన్: అత్యవసర పరిస్థితుల్లో ప్రాణాలు కాపాడే సీపీఆర్‌పై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎన్ఎస్ఎస్ జిల్లా నోడల్ అధికారి డాక్టర్ జేవీ సుధీర్ కుమార్ అన్నారు. కేంద్ర ప్రభుత్వ సీపీఆర్ అవగాహన వారోత్సవాల్లో భాగంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ గుంటూరు జిల్లా శాఖ ఆధ్వర్యంలో మంగళవారం పట్టాభిపురంలోని టీజేపీఎస్ కళాశాల, బ్రాడీపేటలోని బండ్లమూడి హనుమాయమ్మ డిగ్రీ మహిళా కళాశాలలో అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా డాక్టర్ జేవీ సుధీర్‌కుమార్ మాట్లాడుతూ సీపీఆర్ ద్వారా ప్రాణాలను కాపాడవచ్చని గుర్తుచేశారు. దేశంలో ఒక్క శాతం మందికి సైతం ఇది తెలియకపోవటం దురదృష్టకరమన్నారు. డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కౌసల్యాదేవి, టీజేపీఎస్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి, రెడ్ క్రాస్ బ్లడ్ సెంటర్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ వంశీ కృష్ణారెడ్డి, అధ్యాపకులు పద్మజ, రెడ్ క్రాస్ సిబ్బంది పెరుమాళ్లు గౌరీశిరీష పాల్గొన్నారు.

రైళ్లలో చోరీలకు పాల్పడిన వ్యక్తి అరెస్టు



నిందితుడి అరెస్టు చూపుతున్న పోలీసులు

రైల్వేస్టేషన్ (విజయవాడ పశ్చిమ): రైళ్లలో వరుస చోరీలకు పాల్పడుతున్న పాత నేరస్తుడిని ప్రభుత్వ రైల్వే పోలీసులు (జీఆర్‌పీ) అరెస్టు చేశారు. అతని వద్ద 64 గ్రాముల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జె.వి.రమణ కథనం మేరకు.. సెప్టెంబర్ నెలలో రైళ్లలో బంగారు ఆభరణాలు కలిగిన లగేజీ బ్యాగుల చోరీలపై నమోదైన రెండు కేసులకు సంబంధించి జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ పోలీసులు సంయుక్తంగా దర్యాప్తు చేపట్టారు. ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఫతే అలీబేగ్, జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ జె.వి.రమణలు తమ సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం వేజెండ్ల గ్రామానికి చెందిన మూల్పూరి ఫణీంద్ర కుమార్‌ను నిందితుడిగా గుర్తించారు. గతంలో రైళ్లు, స్టేషన్లలో ఇతడు నేరాలు చేసి జైలుకు కూడా వెళ్లొచ్చాడు. నిందితుడు మంగళవారం విజయవాడ కాళేశ్వరరావు మార్కెట్, శివాలయం వీధిలో ఉన్నట్లు సమాచారం అందటంతో పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అతని నుంచి రూ.3.68 లక్షల విలువైన నగలను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని రిమాండ్‌కు తరలించారు.

మొబైల్‌ఫోన్లు బాధితులకు అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్

నగరంపాలెం: మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వారికి ఫోన్లను తిరిగి అప్పగించారు. సుమారు రూ.50 లక్షల విలువైన 250 ఫోన్లను మంగళవారం నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలో బాధితులకు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ అందించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ... ఫోన్లను పోగొట్టుకున్న వెంటనే ఫిర్యాదు చేస్తే సమాచారం దుర్వినియోగం కాదని అన్నారు. ఇప్పటివరకు సుమారు రూ.6.82 కోట్ల విలువైన 3,414 ఫోన్లను బాధితులకు అప్పగించామని చెప్పారు. హెల్ప్ నంబర్ 86888 31574 లేదా సీఈఐఆర్ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు చేయాలని తెలిపారు. ఐటీ కోర్ సీఐ నిషార్ బాషా, హెచ్‌సీ కిషోర్, కానిస్టేబుళ్లు శ్రీధర్, ఇమామ్‌సాహెబ్, యాసిన్, అరుణ, మానస, సీసీఎస్ హెచ్‌సీ రమేష్, కానిస్టేబుల్ కరీముల్లాలను జిల్లా ఎస్పీ అభినందించారు.

జిల్లా వ్యాప్తంగా వర్షాలు

కొరిటెపాడు(గుంటూరు వెస్ట్): బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల గుంటూరు జిల్లా వ్యాప్తంగా తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. సోమవారం ఉదయం నుంచి మంగళవారం ఉదయం వరకు అత్యధికంగా పెదకాకాని మండలంలో 15.2 మిల్లీ మీటర్లు వర్షపాతం నమోదైంది. అత్యల్పంగా మేడికొండూరు మండలంలో 0.8 మి.మీ. పడింది. సగటు 6.3 మి.మీ.గా నమోదైంది. కొల్లిపర మండలంలో 14.2 మి.మీ., మంగళగిరి 13, తాడేపల్లి 10.2, పొన్నూరు 9.8, కాకుమాను 8.4, తుళ్ళూరు 4.2, ప్రత్తిపాడు 3.8, తాడికొండ 3.8, చేబ్రోలు 3, గుంటూరు పశ్చిమ 2.2, ఫిరంగిపురం 1.8, వట్టిచెరుకూరు 1.4, గుంటూరు తూర్పులో 1.2 మి.మీ. చొప్పున వర్షపాతనం పడింది. అక్టోబర్ 14వ తేదీ నాటికి జిల్లాలో సాధారణ వర్షపాతం 58.4 మి.మీ. కాగా, ఇప్పటి వరకు 77.9 మి.మీ. వర్షపాతం పడింది.

ఎయిడెడ్ ఉపాధ్యాయులకు పోస్టింగులు ఇవ్వాలి

గుంటూరు ఎడ్యుకేషన్: జిల్లాలో విద్యార్థుల సంఖ్య 40 కంటే తక్కువగా ఉన్న 46 ఎయిడెడ్ పాఠశాలలు మూతపడనున్న దృష్ట్యా ఆయా పాఠశాలల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులకు ప్రభుత్వ పాఠశాలల్లో పోస్టింగులు ఇవ్వాలని వైఎస్సార్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.థామస్‌రెడ్డి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత పాఠశాలల్లో పని చేస్తున్న 100 మంది ఉపాధ్యాయులకు కౌన్సెలింగ్ ద్వారా పాఠశాలలను కేటాయించి, సర్వీసుకు, వేతనాలకు ఇబ్బందులు లేకుండా చూడాలని కోరారు. కొందరు ఉపాధ్యాయులు మృతి చెందిన నేపథ్యంలో కుటుంబ సభ్యులకు కారుణ్య నియామకాలకు అవకాశం కల్పించాలని డిమాండ్ చేశారు. జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, హెల్త్‌కార్డులు ఇచ్చి, సెలవులను స్వేచ్ఛగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నేడు విద్యుత్ లోక్ అదాలత్

తాడికొండ: విజయవాడకు చెందిన కన్స్యూమర్ గ్రీవెన్సెస్ రీడ్రెస్సల్ ఫోరం (సీజీఆర్ఎఫ్) ఆధ్వర్యంలో బుధవారం రాయపూడిలోని విద్యుత్ భవన్‌లో అదాలత్, అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు అమరావతి క్యాపిటల్ ఈఈ సీహెచ్ వెంకటేశ్వరరావు తెలిపారు. విద్యుత్ భవన్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరగనుంది. సీఆర్‌డీఏ సర్కిల్, అమరావతి క్యాపిటల్ డివిజన్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాలని తెలిపారు. విజయవాడ సీజీఆర్ఎఫ్ చైర్మన్, రిటైర్డ్ జడ్జి ఎన్ విక్టర్ ఇమ్మాన్యుయేల్, సాంకేతిక సభ్యుడు డి. కృపానాయక్, ఆర్థిక సభ్యుడు ఆర్‌సీహెచ్ శ్రీనివాసరావు, స్వతంత్ర్య సభ్యులు సునీత, ఎస్ఈ ఎం. శ్రీనివాసరావు పాల్గొంటారని పేర్కొన్నారు.

నేడు స్వయం ఉపాధి పథకాలపై అవగాహన సదస్సు

నెహ్రూనగర్: స్వయం ఉపాధి పథకాలపై ఎస్సీ యువతకు బుధవారం ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో (జిల్లా పరిషత్ కార్యాలయం రోడ్) అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఆ శాఖ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కె.శ్రీనివాస్ మంగళవారం ఓ ప్రకటనలో తెలియజేశారు. ప్రభుత్వం ద్వారా అందించే స్వయం ఉపాధి పథకాలపై జిల్లాస్థాయిలో అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులు పాల్గొని అవగాహన కల్పిస్తారని చెప్పారు. జిల్లాలోని నిరుద్యోగ ఎస్సీ యువత ఈ అవగాహన సదస్సుకు హాజరై ఉపాధి అవకాశాలను పెంపొందించుకోవాలని సూచించారు.

మొక్కజొన్న విత్తనాలు అధిక ధరకు విక్రయిస్తే చర్యలు



నరసరావుపేట రూరల్: అధిక ధరకు మొక్కజొన్న విత్తనాలు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయ అధికారి ఎం.జగ్గారావు హెచ్చరించారు. జిల్లా వ్యవసాయ శాఖ కార్యాలయంలో మంగళవారం విత్తన డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి 15 రోజులకు విత్తన స్టాక్ రిపోర్ట్‌ను అందజేయాలని తెలిపారు. రైతుకు ఇచ్చే బిల్లు మీద తప్పనిసరిగా లాట్ నెంబర్ వేయాలన్నారు. నాణ్యమైన విత్తనాలను రైతులకు అందజేయాలని, విత్తన చట్టానికి లోబడి ప్రతి డీలరు వ్యాపారం చేయాలని స్పష్టంచేశారు. సమావేశంలో వ్యవసాయ సంచాలకులు వి.హనుమంతరావు, నరసరావుపేట సహాయ వ్యవసాయ సంచాలకులు కేవీ శ్రీనివాసరావు, ఏఓ శాంతి, డీలర్లు పాల్గొన్నారు.

తిన్నారా.. తినలేక పడేశారా..?

ప్రత్తిపాడు బీసీ హాస్టల్లో మారని పారిశుద్ధ్య నిర్వహణ తీరు



హాస్టల్‌లో ఆవరణలో డస్ట్‌బిన్‌లో పడేసిన అన్నం

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు బీసీ బాలుర వసతి గృహంలో పరిశుభ్రత మచ్చుకైనా కానరావడం లేదు. డస్ట్‌బిన్‌లో అన్నం పడేశారు. అసలు ఆహారం తిన్నారా? తినలేక పడేశారా..? ప్రభుత్వం ఇచ్చే బియ్యమే కదా అని అధికంగా వండి వ్యర్థాల డబ్బాలో పారవేశారా..? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. సోమవారం ఉదయం బీసీ కళాశాల బాలుర వసతిగృహంలో కనిపించిన ఈ దృశ్యాలు హాస్టల్ సిబ్బంది నిర్లక్ష్యానికి, ఉన్నతాధికారుల ఉదాసీనతకు ప్రత్యక్ష సాక్ష్యాలుగా నిలిచాయి. పక్కనే కూతవేటు దూరంలో ఉన్న పెదనందిపాడు మండలం అన్నపర్రు బాలుర హాస్టల్లో ఐదు రోజుల కిందట విద్యార్థులు అస్వస్థతకు గురైనప్పటికీ ప్రత్తిపాడు హాస్టల్ సిబ్బందికి కనువిప్పు కలిగినట్లుగా లేదు. హాస్టల్ ఆరంభంలోనే అపరిశుభ్ర వాతావరణం కనిపిస్తోంది. మిగిలిన వ్యర్థాలు డబ్బాలో పడేసి, మూత కూడా పెట్టలేదు. దోమలు, ఈగలు వాలి అధ్వానంగా దర్శనమిస్తున్నాయి. అదేవిధంగా మరుగుదొడ్ల నుంచి వచ్చే మురుగు సైతం ఆవరణలోనే నిలిచి ఉంది. నీటి కొళాయిలు ఉన్న ప్రదేశం అంతా పాచి పట్టి అపరిశుభ్రంగా మారింది. అయినా హాస్టల్ వార్డెన్‌కు కనీసం చీమ కుట్టినట్లయినా లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో ఆహార పదార్థాల వ్యర్థాలు విచ్చలవిడిగా పడేయడంతో విద్యార్థుల ఆరోగ్యానికి ప్రమాదకరంగా మారే అవకాశాలు లేకపోలేదు. ఇకనైనా జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారులు స్పందించి హాస్టళ్లలో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

ప్రభుత్వమే వైద్య కళాశాలలు నిర్వహించాలి



నినాదాలు చేస్తున్న సంఘాలు, పార్టీల నేతలు

గుంటూరు వెస్ట్: ఇప్పటికే పేదవాడికి అందనంత దూరంలో ఉన్న వైద్యాన్ని కూటమి ప్రభుత్వం మరింత దూరం చేస్తోందని దళిత బహుజన ప్రజా సంఘాలు, పార్టీల ఐక్యవేదిక ప్రతినిధులు ఆరోపించారు. ప్రభుత్వమే ఆయా కళాశాలలను నిర్వహించాలని పేర్కొన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వారు ఈ మేరకు డీఆర్వో తదితరుల సమక్షంలో ఫిర్యాదు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... వైద్య కళాశాలలను పి.పి.పి. విధానంలో ఇతరులకు ఇవ్వకుండా ప్రభుత్వమే నిర్వహించాలని డిమాండ్ చేశారు. గత వైఎస్సార్‌సీపీ సర్కారు పేదల కోసం 17 నూతన కళాశాలలను నిర్మించాలని నిర్ణయించినట్లు గుర్తుచేశారు. ఈ మేరకు పనులు ప్రారంభించగా, కూటమి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందన్నారు. ఇతరులకు ప్రభుత్వ వైద్య కళాశాలలను కట్టబెట్టే ప్రయత్నాలు చేస్తోందని మండిపడ్డారు. దీనిని తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. కూటమి ప్రభుత్వం ఇకనైనా తీరు మార్చుకోవాలని పేర్కొన్నారు. ఈ సందర్భంగా తమ డిమాండ్లను వినిపిస్తూ నాయకులు, ప్రతినిధులు నినాదాలు చేశారు.

సాక్షి ఫ్యామిలీ
గుంటూరు
బుధవారం ॥ 15-10-2025

“పఠనాభిరుచి కేవలం ఆహ్లాదానికి సంబంధించిన విషయం మాత్రమే కాదని, అభిజ్ఞా వ్యాయామం (కాగ్నిటివ్ ఎక్సర్‌సైజ్) అని శాస్త్రీయ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. ‘ పుస్తక పఠనం అనేది మెదడులో ఇన్‌ఫర్‌మేషన్ ప్రాసెసింగ్‌కు సంబంధించి కొత్త మార్గాలను సృష్టిస్తుంది’ అంటున్నారు డెవలప్‌మెంటల్ సైకాలజీ అండ్ కాగ్నిటివ్ న్యూరోసైన్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ ప్రొఫెసర్ గ్రెగోయిర్.”



ప్రతీకాత్మక చిత్రం

వద్దిక... ఓవర్ ఒద్దిక బెటర్!

పేరెంటింగ్‌పై చర్చ

ఇది వైరల్ కాలం! సర్వైలెన్స్ కెమెరాల మధ్య బిగ్ బాస్ హౌస్ ఉన్నట్టే జెన్ ఆల్ఫా కూడా తమను సోషల్ మీడియా ఫ్రేమ్‌లో ఫిక్స్ చేసుకుంది! అందుకే వాళ్లు ఎక్కువగా ఇన్‌ఫ్లుయెన్సర్స్‌ను, వాళ్లు చూస్తున్న రీల్స్, షాట్స్, షోస్‌లోని క్యారెక్టర్స్‌ను అనుకరిస్తుంటారు. ఈ తీరు కొందరికి అతిగా... అసహజంగా అమర్యాదగా తోచవచ్చు. ఇంకొందరికి ముచ్చటగా అనిపించవచ్చు. ఈ రెండిటికీ ఉదాహరణగా ఇటీవల వైరల్ అయిన కౌన్ బనేగా కరోడ్‌పతి 17 వ సీజన్ ‘కేబీసీ జూనియర్స్’ లో ఓ చిన్నారి పార్టిసిపెంట్ వీడియోను చూపిస్తున్నారు. దీనిపై కామెంట్లు, కాంప్లిమెంట్లను పక్కన పెడితే ఈ వీడియో.. జెన్ ఆల్ఫా పేరెంటింగ్ కి సంబంధించి ఓ చర్చను లేవనెత్తింది...

కేబీసీలో ఇదీ జరిగింది..
కౌన్ బనేగా కరోడ్‌పతి17వ సీజన్‌లోని ‘కేబీసీ జూనియర్స్’ హాట్ సీట్‌లో ఓ బుడతడు కూచున్నాడు. చుట్టూ కెమెరాలు.. ఆడియెన్స్.. ఎదురుగా 83 ఏళ్ల పాపులర్ పర్సనాలిటీ.. ఎవర్‌గ్రీన్ సెలబ్రిటీ అమితాబ్ బచ్చన్.. అయినా ఎలాంటి బెరుకు లేకుండా చాలా రిలాక్స్‌డ్‌గా.. ఇంకా చెప్పాలంటే ఆ కూర్చోవడంలోనే అందరి అటెన్షన్‌ను గ్రాబ్ చేశాడా పిల్లాడు. వాడి ఆత్మవిశ్వాసానికి ముచ్చటపడుతూ అమితాబ్ ‘హాట్ సీట్‌లో కూర్చోవడం ఎలా ఉంది?’ అనడిగారు. ‘ఎక్సయిటెడ్‌గా ఉన్నాను కానీ.. మీరు రూల్స్ చెబుతూ కూర్చోకండి.. నాకు ఈ షో రూల్స్ అన్నీ తెలుసు.. నేరుగా పాయింట్‌కి వచ్చేద్దాం’ అన్నాడు. ఆ జవాబు హోస్ట్ అయిన అమితాబ్‌ను ఖంగుతినేలా చేసింది. అయినా తమాయించుకుని షోని ప్రొసీడ్ చేశాడు. మొదటి ప్రశ్న అడిగి ఆప్షన్స్ ఇచ్చేలోపే జవాబు చెప్పి ఆప్షన్స్ లేకుండానే నా ఆన్సర్‌ని లాక్ చేసేయ్ డాన్స్.. ఆప్షన్ ఏదైనా ఈ ఆన్సర్ లాక్ చేసెయ్’ అన్నాడు అమర్యాదగా. ఆ తర్వాత ప్రశ్న అడిగేముందు ఏదో చెప్పబోతున్న అమితాబ్‌ను‘మీరు ప్రశ్న యితే అడగండి ముందు’ అన్నాడు అదే ధోరణిని కొనసాగిస్తూ. అదే ప్రవర్తనతో ఆ పిల్లాడు అలా అయిదవ ప్రశ్న దాకా వచ్చాడు. 25 వేలు వచ్చే అయిదవ ప్రశ్న ‘వాల్మీకి రామాయణంలోని మొదటి కాండ ఏది?’ కి ఆప్షన్స్ అడిగాడు ఆ కుర్రాడు.‘బాల కాండ.. అయోధ్య కాండ.. కిష్కింధ కాండ.. యుద్ధ కాండ’ అంటూ నాలుగు ఆప్షన్స్‌ను చదివారు అమితాబ్. వెంటనే ‘బి.. అయోధ్యకాండ’ అని చెబుతూ ‘ఒక్కసారి కాదు ఈ ఆన్సర్‌ను నాలుగుసార్లు లాక్ చేయండి’ అన్నాడు పిల్లాడు. ‘సారీ.. తప్పు చెప్పావ్.. కరెక్ట్ ఆన్సర్ బాలకాండ’ అన్నారు అమితాబ్. ఈసారి ఆ పిల్లాడు ఖంగు తిన్నాడు.

ఆ బాబు వయసు పదేళ్లు. అయిదవ తరగతి చదువుతున్నాడు. గుజరాత్‌లోని గాంధీనగర్‌లో ఉంటాడు. ఆ పిల్లాడు జవాబులు చెబుతూంటే ఆడియెన్స్ గ్యాలరీలో ఉన్న అతని తల్లిదండ్రులు కొడుకువైపు మురిపెంగా.. గర్వంగా చూడసాగారు.

ఈ కార్యక్రమాన్ని వీక్షించిన వాళ్లు సోషల్ మీడియాలో రెండురకాలుగా స్పందించారు. కొందరు ‘జ్ఞానం ఒక్కటే ఉంటే సరిపోదు.. కాసింత వినయం, సంస్కారం కూడా ఉండాలి’,‘అది కాన్ఫిడెన్స్ కాదు ఓవర్ కాన్ఫిడెన్స్.. ’, ‘చదువు కన్నా ముందు పిల్లలకు మర్యాద, మన్నన నేర్పాలి’, ‘అమ్మో... పిల్లాడు కాదు... మహా ముదురు’ అంటూ, ఇంకొందరు ‘అయిదు నిమిషాల ఫుటేజ్ చూసి పిల్లాడి బిహేవియర్‌ని జడ్జ్ చేయడమేంటీ?’, ‘పేరెంట్స్ పిల్లాడికి కాస్త మర్యాదగా నడుచుకోమని చెప్పి ఉంటే బాగుండేది’ అంటూ కామెంట్ చేశారు.

బ్రేక్ పడాల్సిన ప్లేస్ ఇల్లు...

‘ఇలాంటి ప్రవర్తన ఉన్న ట్రెండ్‌ను 6 -13 ఏళ్ల పిల్లల్లో ఎక్కువగా చూస్తాం. ఇది బుద్ధిమాంద్యం లేదా ఏడీహెచ్‌డీ ఏమాత్రం కాదు. డిఫరెంట్‌గా కనిపించాలనే తాపత్రయం, పదిమంది దృష్టిని ఆకర్షించాలన్న లక్ష్యం. ఒక్క మాటలో చెప్పాలంటే డిఫరెంట్ బిహేవియర్‌తో సోషల్ మీడియా అటెన్షన్‌ను గ్రాబ్ చేయడమన్న మాట. దీనికి ఇండివిడ్యువలిస్ట్‌గా పెరగడం, ఓవర్ కాన్ఫిడెన్స్.. ఓవర్ ఆటిట్యూడ్ బిహేవియర్ కారణం. వాళ్లు సోషల్ ఇన్‌ఫ్లుయెన్సర్, రీల్స్, షాట్స్ లోని క్యారెక్టర్లను అనుకరిస్తూ తమ సహజత్వాన్ని మరచిపోతారు. ఆ ప్రభావంతో అందరూ గౌరవిస్తున్న వాళ్ల పట్ల అమర్యాదగా ప్రవర్తిస్తూ అందరి దృష్టిని ఆకర్షించాలనుకుంటారు. అందులో భాగమే పెద్దవాళ్లను ఏకవచనంతో సంబోధించడం, అన్నీ తమకే తెలుసన్నట్లుండటం, వయసుకు మించి మాట్లాడటం లాంటివి. ఇలాంటి పిల్లల ప్రవర్తనను చక్కదిద్దక పోగా దాన్ని వాకి తెలివితేటలుగా అభివర్ణిస్తూ ప్రోత్సహిస్తుంటే ఇదిగో ఇలాగే ఓవర్ కాన్ఫిడెంట్‌గా తయారవుతారు. ఈ తీరును మొక్కగా ఉన్నప్పుడే తుంచేయాలి. దీనికి బ్రేక్ పడాల్సిన ప్లేస్ ఇల్లు.. బ్రేక్ వేసి ఆ ప్రవర్తనను సరిచేయాల్సిన వాళ్లు తల్లిదండ్రులే.



- డాక్టర్ కళ్యాణ్ చక్రవర్తి
కన్సల్టెంట్ చైల్డ్ అండ్ అడల్ట్ సైకియాట్రిస్ట్, హైదరాబాద్

ఆ ట్రైనింగ్ పేరెంట్సే ఇవ్వాలి...

‘ఆ బుడతడి వీడియో చాలా వైరల్ అయింది. వైరల్ అయిన వీడియో కూడా జస్ట్ ఒక టూ త్రీ మినిట్స్ క్లిప్పింగ్ అంతే! దాన్నిబట్టే ఆ పిల్లాడి ప్రవర్తనను, పేరెంటింగ్‌ను జడ్జ్ చేయడం కరెక్ట్ కాదని నా ఉద్దేశం. ట్రోల్ చేయడం కూడా తప్పే. అది పిల్లాడి మీద, అతని తల్లిదండ్రుల మీదా తీవ్ర ప్రభావం చూపిస్తుంది. అయితే.. ఆ పిల్లాడిలో ఇంపల్సివిటీ కనిపిస్తోంది. దాన్ని కంట్రోల్ చేసుకోవాలి. ఆ ట్రైనింగ్ పేరెంట్సే ఇవ్వాలి.

- వర్ష వేములు, సైకోథెరపిస్ట్



● భ్రమణ కాంక్ష



ఆమె చెట్టపట్టాలు


‘భారతదేశాన్ని చూడాలంటే రైలులోనే చూడాలి’ అంటారు మోనిషా రాజేష్. యు.కె.లో స్థిరపడ్డ ఈ మాజీ జర్నలిస్టు ఇప్పుడు పూర్తిగా ‘ట్రావెల్ రైటర్’గా మారారు. ఆశ్చర్యకరంగా ఆమె తన కెరీర్‌కు ‘రైలు’ను ఒక ఆధారంగా మలుచుకున్నారు. అంటే పుస్తకాలు అమ్మడవగా వచ్చే డబ్బు ఆమెకు రైలు ద్వారా వస్తున్నట్టే. ‘హఠాత్తుగా నాకు ఏమర్థమైందంటే నా పుస్తకాలకు రైలు కంటే మించిన కథానాయకుడు లేడని’ అంటారామె నవ్వుతూ. ఆమె తాజా పుస్తకం ‘మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్ – అరౌండ్ ద వరల్డ్ బై నైట్ ట్రైన్’ మార్కెట్‌లోకి వచ్చింది. ప్రపంచంలోని అనేక దేశాలలో రాత్రి జర్నీల ద్వారా ట్రైన్‌లలో సంచారం చేస్తూ తాను చూసిన ప్రపంచాన్ని పరిచయం చేశారు మోనిషా. ఇప్పటివరకూ ‘రైలు’ ప్రయాణాల ఆధారంగా ఆమెవి నాలుగు పుస్తకాలు వచ్చాయి.

మొదటిసారి రైలుతో ప్రేమ

మోనిషా తల్లిదండ్రులది చెన్నై. ఇద్దరూ డాక్టర్లు. అయితే యు.కెలోని నార్‌ఫోక్‌లో స్థిరపడ్డారు. మోనిషా అక్కడే పుట్టి పెరిగింది. ఆమెకు 9 ఏళ్లు ఉన్నప్పుడు తల్లిదండ్రులు రెండేళ్ల పాటు వెనక్కు వచ్చి చెన్నైలో ఉన్నారు కాని ఆ సమయంలో మోనిషాకు దేశం గురించి తెలుసుకునే అవకాశం రాలేదు.

తర్వాత ఆమె చదువు సాగి, జర్నలిస్టుగా మారాక, 2010 లో మరోసారి ఇండియాకు వచ్చారు. ‘నా దేశాన్ని చూడాలి అని నేను అనుకున్నప్పుడు విమాన ప్రయాణం బడాయి వద్దనుకున్నాను. రోడ్డు సేఫ్ కాదు. అందుకే రైలు ప్రయాణం ఎంచుకున్నాను. 90 రోజుల పాస్ తీసుకుని రైళ్లలో తిరగడం మొదలైన రెండు నెలల్లోనే నాకు అర్థమైపోయింది భారత దేశంలో రైలు ప్రయాణం అద్భుతమని. అందుకే ఈసారి ఒక ప్లాన్‌తో వచ్చి 80 ట్రైన్లలో తిరిగి ‘అరౌండ్ ఇండియా ఇన్ 80 ట్రైన్స్’ పుస్తకం రాశాను. దానికి బోల్డంత పాఠకాదరణ, అవార్డులు లభించాయి. ఆ ఉత్సాహం నన్ను రైలులో ప్రపంచ యాత్ర చేసేలా చేసింది’ అని తెలిపారు మోనిషా. ఆమె ఇండియాలో తిరుగుతూ కోణార్క్ ఎక్స్‌ప్రెస్‌లో భువనేశ్వర్ నుంచి హైదరాబాద్‌కు వచ్చారు.. మోనిషా రైలు మార్గం ఉన్న ప్రతి దేశంలో తిరుగుతూ ‘అరౌండ్ ద వరల్డ్ ఇన్ 80 ట్రైన్స్’ పుస్తకం రాశారు. ఇప్పుడు రాత్రి ప్రయాణాలు ఉన్న రైళ్లలో ప్రయాణించి ‘మూన్‌లైట్ ఎక్స్‌ప్రెస్’ పుస్తకం రాశారు.





ధన్యమయ్యే ప్రయాణం

‘నేను భారతదేశమంతా సెకండ్ క్లాస్ ట్రైన్‌లో తిరిగాను. భారతదేశం అర్థం కావాలంటే ట్రైను ప్రయాణం చేయాలి. అదీగాక మనుషులు విమాన ప్రయాణాలతో విసుగెత్తారు. కోవిడ్ వల్ల లాక్‌డౌన్ వచ్చి ముగిశాక ప్రపంచ వ్యాప్తంగా ప్రజలకు భ్రమణకాంక్ష పెరిగింది. లోకం చూద్దాం అనుకుంటున్నారు. దానికి గొప్ప మార్గం రైలే. యూరప్‌లో 2015 నాటికి రాత్రి ప్రయాణాలు ఉండే స్లీపర్ ట్రైన్‌లు బంద్ చేశారు. ఇప్పుడిప్పుడే అవి తిరిగి మొదలయ్యాయి. స్త్రీలు ఒంటరిగా రాత్రిళ్లు రైలు ప్రయాణాలు చేయడం, జీవితాన్ని ఆస్వాదించడంలో భాగమే’ అంటారు మోనిషా.

ప్రకృతి కన్నులు

‘టర్కీ నుంచి ఆర్మేనియా వరకూ 26 గంటల పాటు సాగే రైలు ప్రయాణం అద్భుతం. టర్కీ సౌందర్యం మొత్తం అక్కడ చూడొచ్చు. ఇక అత్యుత్తమ రైలు ప్రయాణమంటే నార్వే దేశానికి వెళ్లాలి. అక్కడ రైలు కంపార్ట్‌మెంట్లు ఇల్లంత సౌకర్యంగా ఉంటాయి. భోజనం ఏది కావాలంటే అది దొరుకుతుంది. అదొక్కటే కాదు రాత్రి మూడు గంటలకు రైలు అద్దాల్లో నుంచి సూర్యోదయం చూడొచ్చు. ఇలా మరెక్కడ సాధ్యం?’ అంటారు మోనిషా.

● కాస్త సరదాగా

ర్యాంప్‌పై స్వీట్ వాక్



– మోడల్స్: శ్రీ గులాబ్ జామ్ గారు, శ్రీ మోతిచూర్ లడ్డుగారు...

స్వీట్లు లేని దీపావళిని ఊహించలేము. మరి దీపావళిని పురస్కరించుకొని ఫ్యాషన్ షోలో మిఠాయిలు పాల్గొంటే ఎలా ఉంటుంది? స్వీట్లు ఏమిటి? ఫ్యాషన్ షో ఏమిటి అని ఆశ్చర్యపోతున్నారా? ఏఐ(ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్) తలుచుకుంటే ఏదైనా సాధ్యమే కదా! ఒక ఏఐ ఆర్టిస్ట్ దీపావళి స్వీట్స్‌కు మోడల్స్‌గా అందమైన రూపాలను ఇచ్చి ఫ్యాషన్ షోలో పాల్గొనేలా చేశాడు. కాజు కట్లీ వయ్యారపు నడకతో ఫ్యాషన్ షో మొదలవుతుంది. ఆ తరువాత శ్రీయుత మిల్క్ కేక్ గారు, మిస్ బర్ఫీ కుమారి గారు, శ్రీమతి మోతిచూర్ లడ్డుగారు కూడా వస్తారు. చీర ధరించి ర్యాంప్ వాక్ చేసిన సోన్ పాపిడీ గారితో షో ముగుస్తుంది. ఆన్‌లైన్ లో షేర్ చేసిన ఈ ఏఐ జనరేటెడ్ వీడియో నెటిజనులలో నవ్వులు పూయిస్తుంది.

● బై మిస్టేక్

‘క్యాన్’తార



ఒక పౌరాణిక సినిమాలో ఏదో సీన్‌లో దూరంగా రైలు వెళుతున్న దృశ్యం, మరో సినిమాలో కరెంట్ తీగలు కనిపించడం గురించి సరదాగా మాట్లాడుకుంటారు.
తాజా విషయానికి వస్తే... ‘కాంతార’ సినిమాలో ఒక సీన్ వైరల్ అయింది.

కాంతార కథ రాజుల కాలం నాటిది. ఆ కాలంలో వాటర్‌క్యాన్‌లు ఉండే ఛాన్స్ లేదు. అయితే ఈ సినిమాలో విందుభోజనాలకు సంబంధించిన ఒక సీన్‌లో దూరంలో వాటర్ క్యాన్ కనిపిస్తుంది. ఇప్పుడు ఈ మోడ్రన్ ప్లాస్టిక్ క్యాన్ ఇంటర్‌నెట్‌లో టాకింగ్ పాయింట్ అయింది.

‘ఆ కాలంలో ప్లాస్టిక్ లేనే లేదు. నిజానికి ప్లాస్టిక్ ఎప్పుడు పుట్టిందంటే, ప్లాస్టిక్ పితామహుడు ఎవరంటే’ ఇలాంటి జనరల్ నాలెడ్జ్ విషయాలతో పాటు... ‘ఫలానా సినిమాలో ఫలానా పొరపాటును మీరు గమనించారా?’లాంటి విషయాలెన్నో సోషల్ మీడియాలో షేర్ చేస్తున్నారు.

ఇక ఈ ప్లాస్టిక్ క్యాన్ సీన్‌పై మీమ్స్ సంగతి సరే సరి. ‘ఇది బడా బ్లండర్ ఏమీ కాదు. పెద్ద సినిమా అన్నాక చిన్న తప్పులు సహజమే’ అని ఒక యూజర్ మూవీ మేకర్స్‌ని సమర్థించాడు.

● లీగల్

మీ మాజీ భార్య భర్తపై మీరు కేసు వేయొచ్చు!

నా భార్య మరొకరితో సంబంధం పెట్టుకొని నా నుంచి విడాకులు తీసుకుంది. విడాకుల కేసులో నేను తనకు ఫలానా వ్యక్తితో వివాహేతర సంబంధం ఉంది అని పేరుతో సహా చెప్పినప్పటికీ, తనకు అలాంటివేమీ లేవని కోర్టును నమ్మించింది. దాంతో నేను పదిలక్షల రూపాయలు భరణంగా చెల్లించవలసి వచ్చింది. మా విడాకులు అయిన 7 నెలలకే తను అదే వ్యక్తిని పెళ్లి చేసుకుంది. తను నా భార్యగా ఉన్నప్పుడు వారు కలిసి తీసుకున్న ఫోటోలు కొన్ని పెళ్లి వీడియోలో పెట్టి ఇంటర్నెట్లో కూడా పెట్టుకున్నారు. నన్ను మానసిక క్షోభకి గురి చేసినందుకు నేను నా మాజీ భార్య ప్రస్తుత భర్తపై కేసు వేయవచ్చా? ఎందుకంటే, ఇటీవలే పేపర్‌లో తైవాన్‌లో భార్య ప్రియుడిపై భర్త కోర్టులో దావా వేయగా కోర్టు అతనికి పరిహారం కూడా చెల్లించమని చెప్పిందని ఒక వార్త చదివాను. మనదేశంలో కూడా అలా చేసే వీలుందా?

- సంపత్, హైదరాబాద్

రెండు వారాల క్రితం ఇలాంటి ఒక కేసు గురించి మన పత్రికలో కూడా సమాధాన రూపంగా చెప్పాను. వివాహేతర సంబంధాలు చట్ట రీత్యా నేరాలుగా పరిగణించక పోయినప్పటికీ, సివిల్ దావాలు/పరిహారాలు కోరడానికి భారతీయ చట్టాలలో ఎటువంటి అడ్డంకీ లేదు. మారుతున్న సామాజిక పరిణామాల దృష్ట్యా, వివాహేతర సంబంధాలు ఇకపై సివిల్ కోర్టుకు చేరే అవకాశాలే ఎక్కువగా కనిపిస్తున్నాయి.

మీరు మీ మాజీ భార్య ప్రియుడి మీద (ప్రస్తుతం ఆమె భర్త) ఖచ్చితంగా కేసు వేయవచ్చు. పరిహారం కూడా కోరవచ్చు. ఇటీవలే ఢిల్లీ హైకోర్టు తన తీర్పులో ఒక భార్య తన భర్త ప్రియురాలిపై వేసిన దావా చెల్లుతుంది అని పేర్కొంది. అయితే మీరు కేసు వేసిన తర్వాత, మీ మాజీ భార్యకి, తన భర్తకి సంబంధం ఉండేదనే విషయాన్ని ఖచ్చితమైన సాక్ష్యాధారాలతో రుజువు చేయవలసి ఉంటుంది. కోర్టును ఎవరు ఆశ్రయిస్తే వారే తమ పక్షం వాదనని వాస్తవాలేనని రుజువు చేసుకోవాల్సి ఉంటుంది! కేవలం గతంలో వారిద్దరూ కలిసి తీసుకున్న కొన్ని ఫొటోల ఆధారంగా మాత్రమే మీరు కేసు గెలవడం కొంత కష్టమే! అయితే, అసలు మీ మాజీ భార్యకు అతనితో పెళ్లికి ముందు పరిచయమే లేదు అతను ఎవరో నాకు తెలియదు'' వంటి సమాధానాలు చెప్పి ఉన్నట్లయితే, మీ డైవర్స్ కేసులో జరిగిన వాదోపవాదాలను ఆధారంగా తీసుకొని మీ తరఫు సాక్ష్యాలుగా కూడా కోర్టు ముందు ఉంచవచ్చు. ఇవన్నీ ఒకవేళ రుజువు అయినట్లయితే మీకు మానసిక క్షోభ కలిగించినందుకు గాను, ఆర్థికంగా కూడా మీరు నష్టపోయినందుకు గాను, మీరు తగిన పరిహారం పొందే అవకాశం లేకపోలేదు. మీరు కేసు వేయాలి, తగిన సాక్ష్యాధారాలతో రుజువు చేయగలను అనుకుంటే, మీ మాజీ భార్యని కూడా కేసులో పార్టీ చేయండి. ఇంతవరకు ఇలాంటి కేసులు లేకపోయినప్పటికీ, ఇటీవలే మన భారతీయ కోర్టులు ఇచ్చిన తీర్పుల ఆధారంగా మీ కేసు విచారణకు మాత్రం అర్హత సాధించింది. కేసు గెలవడం ఓడిపోవడం తర్వాత సంగతి. అన్ని సాక్ష్యాధారాలు, ముఖ్యంగా మీ డైవర్స్ కేసులో మీ మాజీ భార్య ఇచ్చిన వాంగ్మూలాలు/ క్రాస్ ఎగ్జామినేషన్‌లో తను చెప్పిన సమాధానాలు వంటివి నిక్షిప్తపరిచి ఒక లాయర్‌ను సంప్రదిస్తే మీకు ఉపశమనం లభించవచ్చు.

- శ్రీకాంత్ చింతల, హైకోర్టు న్యాయవాది
మీకున్న న్యాయపరమైన సమస్యలు, సందేహాల కోసం sakshifamily3@gmail.comకు మెయిల్ చేయవచ్చు.



● వైల్డ్ లైఫ్ ఆర్టిస్ట్

కాంక్రీట్ వనాలు పెరిగిపోతున్న నేటిరోజుల్లో వన్యప్రాణుల మనుగడ ప్రశ్నార్థకం అవుతుందన్నది తెలిసిందే. ఈ క్రమంలో సెల్ఫ్ ఆర్టిస్ట్‌గా పేరొందిన మీరట్ వాసి దీక్షా చౌహాన్ అడవి జంతువుల జీవన వ్యథను, బతుకు పోరాటాన్ని తన హైపర్ రియలిస్టిక్ చిత్రాలతో మన కళ్లకు కడుతోంది. స్థిరమైన ఆదాయాన్ని ఇచ్చే ఇంజినీరింగ్ ఉద్యోగాన్ని వదిలి, చిన్నప్పుడు హాబీగా నేర్చుకున్న పెయింటింగ్‌తో దోస్తీ చేసింది. ఏ టేబుల్ మీద అయితే ల్యాప్‌టాప్‌తో సాఫ్ట్‌వేర్ వర్క్ చేసేదో అదే టేబుల్‌ను కాన్వాస్‌గా మార్చుకుంది. ఐదేళ్లుగా తన బ్రష్ స్ట్రోక్స్‌తో అడవి జంతువులకు గొంతుకగా మారిన దీక్ష పెయింటింగ్ కళ దేశ సరిహద్దులను దాటి ప్రపంచ వన్యప్రాణి ప్రేమికులకు చేరువయింది. ఉపాధితో పాటు ఉపయుక్తమైన మార్గాన్ని ఎంచుకున్న దీక్ష నేడు ఎంతోమంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తోంది.



వన్యప్రాణులకు కుంచెతో ప్రాణం



‘**ఒ**క కళాకారిణిగా నేను దేనికీ కట్టుబడి లేనట్టు ఎదుటివారికి అనిపిస్తుంది. కానీ, నేను ప్రతి దానితో కనెక్టివ్‌గా ఉన్నాను. దేనికీ దూరం కాలేదు’ అని చెబుతుంది 29 ఏళ్ల దీక్ష చౌహాన్. ఐదేళ్ల క్రితం సాఫ్ట్‌వేర్ ఉద్యోగాన్ని వదిలి, తిరిగి పెయింట్ బ్రష్ పట్టుకుంది. అందమైన సినరీలు, పోర్ట్రయిట్‌లు పెయింట్ చేస్తూ అడవి జంతువులవైపు దృష్టి సారించింది. ఒక ఉన్నతమైన ప్రయోజనాన్ని కలిగించే మార్గాన్ని అన్వేషిస్తూ అడవి జీవుల వ్యథలను చిత్రీకరిస్తూ, వాటికి గొంతుకలా మారింది.

మూలాలకు చేరుకున్న కళ

దీక్ష పెయింట్ బ్రష్ అందుకోవడానికి ముందు సంగీతం, నృత్యం కళలు ఉన్న ఇంట్లో పెరిగింది. కళ ఒక కాలక్షేపానికి కాదు, అది ప్రపంచాన్ని చూపే ఒక మార్గం అని తెలుసుకుంది. ఇంజినీరింగ్ విద్య డిగ్రీకి కొలమానంగా, ఉపాధిని పొందడానికి ఒక మార్గంగా చూపుతున్నప్పటికీ ఒక చోట తనను తాను బంధించుకోలేనని నిర్ణయించుకుంది. సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిగా కెరీర్‌ను కొనసాగిస్తున్న ఆమె కళాకారిణిగా వెనక్కి తిరిగి చూసుకుంది. సంతృప్తిగా సాగుతున్న ఈ కళా ప్రయాణం తనను తన మూలాలకు తిరిగి చేర్చిందనుకుంది.

సృజనాత్మకత పరిరక్షణ

దీక్ష వన్యప్రాణుల చిత్రాలు చాలా వాస్తవికంగా ఉంటాయి. ఆ చిత్రాలను చూసేవారు వెంటనే ఉలిక్కిపడతారు. పులి చూపులు మన మీదకు దూకేలా అనిపిస్తాయి. ఖడ్గమృగాన్ని ఒక సారి తాకి చూద్దాం అనుకుంటారు. పక్షులు ఆకాశం మధ్యలో ఆగిపోయినట్లు కనిపిస్తాయి. అయినప్పటికీ అవన్నీ కదలికలతో సజీవంగా ఉంటాయి. దీక్ష చూపే సున్నితమైన సృజన, సాంకేతిక నైపుణ్యంతో మనల్ని జంతువులతో కనెక్ట్ అయ్యేలా చేస్తుంది. అంతరించిపోతున్న జాతులను రక్షించేందుకు, వాటి ఆవాసాలను సంరక్షించే చొరవకు మద్దతును ఇస్తుంది. దాడికి గురైన మూగప్రాణుల వెతలను కళ్లకు కడుతుంది. ఎన్నో చిత్ర ప్రదర్శనలు, సోషల్ మీడియా, జంతు పరిరక్షకుల సహకారంతో ఆమె తన ప్రతిభను ప్రజలకు చేరవేస్తుంది. మూగజీవాలకు –ప్రజలకు మధ్య వారధిగా తన కళను ఉంచుతుంది. ఆమె కళ జంతుజాలం మనుగడ, దుర్బలత్వం, మనుషుల ప్రమేయం .. ఇలా కథలుగా చూపుతుంది.

ప్రపంచ గుర్తింపు

దీక్ష చేస్తున్న కళా సేవ మన దేశ హద్దులను దాటి ప్రపంచం గమనించేంతగా వెళ్లింది. అన్ని ఖండాలలోని కళారాధకులను చేరుకుంది. కళా సేకరణదారులు, వన్యప్రాణుల రక్షకులు ఆమె సృజనను అర్థం చేసుకున్నారు. జీవ నాణ్యత, మనుగడ, వాటి ఆధారంగా ఉండే లక్ష్యానికి కూడా ఆకర్షితులయ్యారు. ఆమె కాన్వాసులు చాలా మంది చూడని అటవీ ప్రపంచానికి చేరువ చేసింది. స్వరం లేని మూగజీవాలకు తన కళ స్వరం ఇవ్వగలదని దీక్ష నమ్ముతుంది. ఆమె ప్రతి బ్రష్ స్ట్రోక్ ఒక వాదనను వినిపిస్తుంది. ప్రతి పెయింట్ ఒక సందేశాన్ని ఇస్తుంది. ప్రేక్షకులు ఆమె పెయింటింగ్స్ ముందు నిలబడినప్పుడు వారు చిత్రాలను మాత్రమే కాదు దీక్ష కళ్లతో అడవిని వీక్షిస్తున్నారు. అడవి జీవుల కష్టాలను అర్థం చేసుకుంటున్నారు. ఆమె తన స్ట్రోక్స్‌తో మూగజీవాల మనుగడకు పాటు పడేలా చేస్తోంది. ఆమె తన కళ ద్వారా ఉత్కంఠభరితమైన రచనలను కూడా సృష్టిస్తుంది. టాలెంట్‌ను ఇలా కూడా చూపవచ్చు అని ఎంతో మందికి తన కళ ద్వారా రుజువు చేస్తోంది.

బులియన్
(బంగారం 10 గ్రా.: వెండి కిలో)
అక్టోబర్ 14న ముగింపు రూ.లలో

నగరం	బంగారం (24 క్యారెట్లు)	బంగారం (22 క్యారెట్లు)	వెండి
హైదరాబాద్	1,31,310	1,18,42	1,97,000
విజయవాడ	1,30,340	1,17,950	1,85,400
విశాఖపట్నం	1,28,350	1,17,650	2,06,000
రాజమండ్రి	1,30,840	1,21,400	1,85,400
ప్రొద్దుటూరు	1,31,000	1,20,520	1,85,000
చెన్నై	1,29,000	1,18,250	2,06,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.